# హత్య

అవును మీరు సరిగ్గానే విన్నారు. హత్య! అవును నేను హత్య చేద్దామనే నిర్ణయానికి వచ్చాను. అది నేరమని, దొకితే శిక్ష తప్పదనీ తెలిసే హత్య చేద్దామనే నన్ను నేను ఒప్పించుకున్నాను. నా సంకల్పం ఎప్పుడూ వృధా కాదని నా జీవితం నేర్పిన పాఠం. అయినా ఇంత దారుణమైన నిర్ణయం వెనుక ఎంత బలమైన కారణాలున్నాయో మీకు వివరిస్తాను. ఈ వివరణలు కోర్టులో చెల్లవనీ తెలుసు. అయినా నేను హత్య చేయటానికే మొగ్గు చూపుతున్నాను.

అందరికీ వున్నట్లే నాకొక ఇల్లుంది. అది పల్లెటూరు కాదు, పట్టణం కాదు. అందరికీ వున్నట్లే నాకూ ఒక ఇరుగు పొరుగూ వుంది. కాని అందరిలాగా కాకుండా నా పొరుగువాడు ఒక దుర్మార్గుడు. వాడు నాకు దూరపు–అక్రమ చుట్టాన్నవుతానని చెప్పి నమ్మిస్తుంటాడు అందర్నీ. సామాన్యంగా అక్రమ సంతానం వక్రంగానే వుంటారు. వ్యాసుల వారు చెప్పినట్లు భయం భయంగా – అపరాధంతో పుట్టిన పుట్టు గుడ్డులు వక్రంగానే ఆలోచిస్తారు. కళ్లుండీ చూడలేరు. మంచి తెలిసీ చెడుగానే వుంటారు. అక్రమ సంబంధాలే పెట్టుకుంటారు. ఎందుకిలా నెగెటివ్‌గా చెపుతున్నానని అనుకోవద్దు. ఈ అనుభవం మీకూ వుంటే మీరు ఇలాగే మాట్లాడతారు.

* * * *

సంవత్సరంలో రోజులన్నీ ఒకలాగా వుండవు. కొన్నాళ్లు చలీ, కొన్నాళ్లు ఎండా, మరికొన్నాళ్లు వర్షం, అలా ఒక వర్షం కురిసే రాత్రి నాకేవో శబ్దాలు వినిపించాయి. గొడుగు వేసుకుని చీకోట్లో చుట్టూ చూశాను. నేను వుండేది రెండో అంతస్తులో. మా ఇంటికి దక్షిణంగా వాడి కొంప వుంది. ఇద్దరికీ మధ్యలో ఒక 8 అడుగుల దారిలాంటి ఖాళీ వుంది. ఆ రాత్రి వర్షంలో వాడు ఇద్దరు మనుషుల్తో గుంటలు తీస్తున్నాడు. "ఎవడ్రా అది" అని అరుస్తూ కిందికి వెళ్లాను. వాడు ఇంట్లో దూరాడు. ఇద్దరు కూలీల్ని చెడామడా తిట్టాను. మాకు తెలీదు అయ్యా ఆ అయ్యగారు తవ్వమన్నారు అన్నారు భయపడుతూ. వాణ్ణి, మిమ్మల్ని ఈ గోతుల్లో పాతిపెడతా లంబ్డికొడకల్లారా అని ఆ పని ఆపించేశాను.

కేవలం ఈ మాత్రానికే హత్య చేస్తారా అని అనుమానం రావచ్చు. కాని హత్యకు దారి తీసే సంఘటనలు చాలానే జరిగాయి. కొన్ని వివరంగా చెప్తాను.

సహజంగా దుర్మార్గులు కీడు తలపెట్టటానికి మనలాంటి వారి ఉదాసీనత అనే మంచితనం కూడా కారణం కావచ్చు. ఇందాక చెప్పిన ఎనిమిది అడుగులు ఖాళీలో వాడికి నడిచే హక్కు లేదు. కాని వాడి డ్రైనేజీ గొట్టాలు ఇందులోంచే వెళ్తున్నాయి. కేవలం ఆ కారణంగా గోడ కట్టకుండా అలా వదిలేశాను. నాకు అటుగా నడిచే అవసరం లేదు. అవసరం వున్నా లేకపోయినా హక్కు వదులుకోలేము. మరొకడు ఆక్రమిస్తే చూస్తూ వూరుకోము. ఏదో వాడికి దారి లేక తిరుగుతున్నాడులే అని చూసీ చూడనట్లు పోవటమే తప్పయిపోయింది. ఇలాంటి చిన్న తప్పులే పెద్ద ముప్పు తెస్తాయి. చివరికి హత్య దాకా దారి తీస్తాయి.

ఒకరోజున వాడికి కబురు చేసి నా ముందు నుంచోబెట్టే చెప్పాను. అరే చూడు, నీకు ఈ స్థలంలో తిరిగే హక్కు కూడా లేదు. గోడ నువ్వు కట్టుకుంటావా? నన్ను కట్టమంటావా? అని గట్టిగానే చెప్పాను. అయ్యో

'అన్నగారో–బావగారో' అని ప్రాధేయపడి నాకు నడక దారి లేదు. డ్రైనేజీకీ దారి లేదు. దయచేసి మీరు అడ్డు పెట్టకండి అని కాళ్లా వేళ్లా పడినట్లు నటించాడు. నేను కూడా వాడిని నమ్మినట్లు పైకి సరే అంతవరకే అని వార్నింగ్ ఇచ్చి పంపాను.

* * * *

ఆ తర్వాత నేను అమెరికా వెళ్ల వలసి ఓ నెలో రెండు నెలలో వూళ్లో లేను. నేను వచ్చేసరికి ఆ ఖాళీ దారి పొడవునా తాటాకు పందిరి వేసి వుంది. నా దగ్గరవున్న కర్ర పుచ్చుకుని వాడి మీదికి వెళ్లాను. ఏంట్రా ఈ పని. తీసేయి ముందు అని. 'అక్కయ్యతో చెప్పాను, ఎండాకాలం అయిపోగానే తీస్తాను బావా' అని భయం నటిస్తూ గొణిగాడు. నాకోపం మా ఆవిడకు మళ్లింది. ఏమయింది పందిరేగా ఎప్పుడైనా పీకేయవచ్చు. ఎందుకు అంత హైరానా అని నాకు క్లాసు పీకింది. ఈ సమస్య ఇపుడు ఇంట్లోకి వచ్చింది!

* * * *

ఎండాకాలం వెళ్లి తొలకరి చినుకులు పడినా పందిరి పదిలంగానే ఉంది. ఏమో అలాగే ఉండిపోయేదేమో. ఆ నెలలోనే గాలివాన రాకపోతే గాలికి ఆకులు ఎగిరిపోయి, వానకు వాసాలు కూలిపోయి అదొక యుద్ధానంతర ప్రదేశంలా వుండి పోయింది. వాడికి నడవటానికి మిగతా కార్యక్రమాలకు అడ్డుగా వుందని ఆ కూలిపోయిన పందిరిని అప్పుడు కాస్త, ఇప్పుడు కాస్త తీసివేసుకుంటూ వచ్చాడు. వాడి అయిష్టాన్ని నేను గమనిస్తూనే వున్నాను. నాకు అటు వెళ్లే పని లేకపోయినా, నాతో ఇద్దర్ని వెంటపెట్టకుని అటూ ఇటూ తిరిగి వస్తూండేవాడిని. ఆ సమయంలో వాడు నాకు కనపడేవాడు కాదు. "అన్నయ్యగారూ కాఫీ తాగి వెళ్లండి" అని వాడిపెళ్లాం పిలుస్తూండేది. దానికీ ఒక కారణం వుంది. ఈ పొరుగింటి పోకిరీకి ఎవ్వరూ పిల్ల నివ్వటానికి రాలేదు. మరి ఈ సంబంధం ఎలా కుదిరిందో, పెళ్లయితే అయింది. తర్వాత వాడు పేచీ పెట్టుకుని అమ్మాయిని ఇంటికి పంపేశాడు. అప్పటికే వాడికి ఒక నర్స్‌తో అక్రమ సంబంధం వుంది. అదెలాగంటే వాడు ఒకసారి ఎవ్వరితోనో దెబ్బలాడితే వాళ్లు చితకబాదారు. దెబ్బలతో ఆస్పత్రిలో చేరాడు. వీడికి సేవ చేసిన నర్స్‌నే ట్రాప్ చేసి వేరే పెట్టాడు. తర్వాత పెళ్లితంతు! పేచీ కూడా. ఆ అమ్మాయి–వీడిపెళ్లాం తండ్రి నాకెక్కడో పరిచయం. ఆ పరిచయంతో వాడి పెళ్లి పంచాయితీ చేయాల్సి వచ్చింది. ఆ విధంగా వాడిని ఒప్పించి భార్యని ఇంట్లో పెట్టాం మళ్లీ. అందుకే అటుగా వెళ్తే కాఫీ ఇస్తుంటుంది.

లోతుగా ఆలోచిస్తే – అదే నేను వీడిని హత్య చేయటానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నపుడు, ఆ రోజు పంచాయితీలో నామాట వీడు వినటానికి ఒక కారణం ఈ ఎనిమిదడుగుల నడకదారే అనుకుంటాను!

* * * *

తర్వాత జరిగింది చాలా కుట్ర. వీడు నేను ఊర్లో లేనపుడు అక్క–అక్క అంటూ నా శ్రీమతితో, వదినా వదినా అంటూ వాళ్లావిడచేతా చిన్నా చితికా మీటింగులు పెట్టేవాడని–అలాంటి ఒక మీటింగులో ఆ స్థలం వాడికి అమ్మడానికి, ఎలాగూ మీరు నడవటం లేదు, మీరు అటుగా రావటం లేదు, అది మీకు దక్షిణం, అది మీకు అవసరం లేదు కదా, నాకు ఇవ్వండి, రెండు లక్షలు ఇస్తాను, ఎలాగైనా బావగారిని నువ్వే ఒప్పించు అని కాళ్లా వేళ్లా పడినట్లున్నాడు. దీనికి చాలా ప్రణాళిక కావాలి కదా.

మళ్లీ నేను ఊరు నుండి వచ్చేసరికి ఈమె చాలా తెలివిగా 'మీకు రెండు లక్షలు లాటరీ వస్తే ఏం చేస్తారు?' అంది. "ఏముంది నీకిచ్చేస్తాలే" అన్నాను. 'మాట తప్పరు కదా' అని లోపలికెళ్లిపోయింది. ఆ సంగతి నేను మర్చిపోయాను. ఓ మంచిరోజు చూసి వాడు రెండు లక్షలు తెచ్చి ఆమె చేతిలో పెట్టి వెళ్లిపోయాడు. ఇదంతా నా వెనకనే జరిగిపోయింది. చెప్పాను కదా. ఈ సమస్య ఇంట్లోకి వచ్చిందని.

మన బలహీనతలు మనకుంటాయి. అలాంటి బలహీనక్షణంలో ఇల్లాలు విషయం చెప్పీ చెప్పకుండా రెండు లక్షలు నాకు చూపించి బీరువాలో పెట్టుకుంది.

మర్నాడు కిందకు వెళ్లి వాణ్ణి చెడామడా తిట్టాను. వాడు వంకరనవ్వు నవ్వుతూనే వున్నాడు.

ఆ తర్వాత ఎప్పుడు దస్తావేజు రాయించాడో – ఆమెకిచ్చి వెళ్లాడు. ఈమె నాకు చూపించింది. 'పో నువ్వే వెళ్లి చూసుకో, నీ పేరుతోనే ఉందిగా' అని అన్నాను కాని నాకేమాత్రం ఇష్టంలేదు. కాని లోపల ఇంతటితో ఈ న్యూసెన్స్ వదలిపోతుందిలే. కాపలా కాసే పని వుండదనుకున్నాను.

రిజిస్ట్రేషన్ అయిపోయింది. మూడు నెలల్లో ఆ ఎనిమిదడుగుల వెడల్పు, ఇరవయి అడుగుల పొడవు స్థలంలో కింద నడిచేందుకు వదిలి పైన రెండతస్తులు లేపాడు. దానికి మున్సిపాలిటీ పర్మిషన్ రాదు. వాడికీ నా గోడకి అయిదడుగులు ఖాళీ వుండాలి. అయిదంగుళాలు కూడా వదల్లేదు. మున్సిపాలిటీ ఇన్‌స్పెక్టర్‌ని పిలిచి అడిగాను. పర్మిషన్ ఎలా ఇచ్చారని. 'పర్మిషనా? ఎవరిచ్చారు' అన్నాడు. వాడి రెండో అంతస్తు కిటికీ నా పెంట్‌హౌస్ మెట్లకు ఆనుకుని వుంది. అతికష్టం మీద బెదిరించి ఆ కిటికీ మూయించాను.

అప్పటి నుంచి వాడి ప్రవర్తన మారింది. నేనంటే (గౌరవం?) వున్నట్లుగా కూడా నటించటం లేదు. వాడికి చదువు సంధ్యా లేదు. అచ్చం ప్రపంచం మనిషి, వాడు–వాడి చుట్టూ. ఇదీ వాడికి కావలసింది ఏదో విధంగా పోగుచేసుకోవటం. వాడితో నాకేమిటి? చెప్పండి. వాడి బ్రతుకు వాడు బ్రతకవచ్చు కదా. కాని ఈ కథ ఇక్కడితో ఆగిపోతే – ఈ హత్య జరిగేది కాదు. నేను హంతకుడిగా మారవలసిన అవకాశం వుండేది కాదు. అదే కదా దారుణమైన సంగతి!

* * * *

తరువాత పరిణామాలు – ప్రపంచీకరణకు సంబంధం వుంది. మన కథకుల, కవుల ఆలోచనల ప్రకారం అదేనండి అన్ని పట్టణాల్లో కార్లో తిరగటానికి రోడ్లన్నీ వెడల్పు చేయటం, అడ్డం వచ్చిన గోడలు – కట్టడాలు పడగొట్టడం, కథలు, కవిత్వాలు రాయడం, రోడ్డు పక్క ఉపాధి పోయిందని ఏడవటం ఇవన్నీ ప్రపంచీకరణలో భాగం. ప్రపంచీకరణ పరిణామాలు – మనం ప్రపంచంలోనే ఉన్నాం కదా. ఆ తాకిడి మనకు తగలకుండా ఉంటుందా? నా ఇంటికీ, ప్రధాన వీధికీ ఇది తప్పలేదు. వీధి గోడలు కూలాయి. కొంతమేర కట్టడాలు పోయాయి. మున్సిపాలిటీవాళ్లు రూపాయి ఇవ్వలేదు. చేతిలో వ్యాపారం పోయింది. ఒకరకంగా బ్రతుకు అతలా కుతలమయింది. ఇది తట్టుకోవటానికి, మళ్లీ కట్టుకోవటానికి చాలా సమయం చాలా లక్షలే కావాల్సి వచ్చింది.

ఇదంతా ఒక సంవత్సరంపైనే పట్టింది. నా బిల్డింగ్ తూర్పు ప్రక్కన ఏడడుగుల స్థలం నడవటానికి, దానికి రక్షణగా గోడ వుంది. అయితే ఉత్తరాన రోడ్డు వెడల్పుతో ఖాళీ ఏర్పడింది. అక్కడ వున్న షాపు పోయింది. వీధి నుంచి సరాసరి లోపలికి రావటానికి ఇప్పుడు ఇనుపగేటు పెట్టాల్సి వచ్చింది. అసలు చిక్కు ఇక్కడే వుంది.

నా పొరుగువాడు నాకు జరిగిన నష్టానికి బాగా సంతోషించాడు. వాడి సంతోషాన్ని దాచలేదు కూడా. మున్సిపాలిటీ వాళ్లు నాకు నష్ట పరిహారం ఇవ్వలేదు కాని మరో అంతస్తు వేసుకోవటానికి అనుమతి ఇచ్చారు. ఎలాగో కష్టపడి నేను వున్న ఇల్లు ఖాళీ చేసి అంతా కలిపి రెండో అంతస్తు పూర్తి చేశాను. అది అద్దెకిచ్చి వేరేచోట ఇల్లు తీసుకున్నాం. ఇప్పుడు ఇద్దరమే ఉంటున్నాం. పిల్లలు ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు. రెండో అంతస్తు పైన ఒక ముసలి కాపలాదారుణ్ణి పెట్టి నేను పైలా పచ్చీసు యాత్రలు చేస్తున్నా.

జీవితంలో అన్నీ సంతోషకరమైన రోజులే వుంటాయా? అలాంటి ఒక దుర్దినాన నాకు ముసలికాపలా కబురు తెచ్చాడు. వాడు మన తూర్పు స్థలంలో నుంచి గోడ పగలగొట్టి ప్రధాన వీధికి దారి పెట్టుకున్నాడు. వాడి బిల్డింగ్ బాయ్స్‌హాస్టల్‌కి ఇచ్చాడు. వాడి మెస్‌కు ప్రధాన వీధి నుండే అన్నీ చేరుతున్నాయి అని.

నాకు మండిపోయింది. కబురు చేశాను. వచ్చాడు. వాడితోపాటు ఒక నల్లకోటు వాడు వున్నాడు. ఈయన ఎవరు అన్నా. 'లాయరు, మొన్న ఒకణ్ణి కొట్టాను. పోలీసులు పట్టుకు వెళితే ఈయనే విడిపించాడు' అని చెప్పాడు. ఈ మొత్తం కథలో వాడు నన్ను ఏవిధంగా బెదిరిస్తున్నాడో అర్థం కాని వాణ్ణి కాదు.

అప్పుడు 'పగలగొట్టిన గోడ ఈ రాత్రికి కట్టు. నేను రేపు పొద్దున వస్తాను'. అది కాదు బావా అని నసిగాడు– నల్లకోటువాడు, 'సార్ మీకు మీకు ఎందుకు? మూడు లక్షలు ఇస్తాడు, ఆ దారి వాడుకోనివ్వండి' అన్నాడు!

నాకు వాణ్ణి తన్నాలనిపించింది. 'అది అమ్మేది కాదు. రాత్రికి కట్టండి అన్నాను'. వాడు కట్టడని తెలుసు. కాని ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. ఇది ఇండియా పాకిస్థాన్ బోర్డర్ సమస్య. యుద్ధం తప్పదు. మర్నాడు ఎవరో తెలిసిన వారిని పట్టుకుని పోలీస్ కమీషనర్ దగ్గరకు వెళ్లాను. 'సార్ మీ యింట్లో దొంగలు పడితే ఏం చేస్తారు' అన్నాను. 'అదేంటి'? అప్పుడు చెప్పాను. ఆయన ఆ పరిధి ఎస్.ఐని పిల్చి 'వాణ్ణి రప్పించు విషయం చూడు' అని ఆయన పనిలో పడిపోయాడు.

ఎస్.ఐ ఇది సివిల్‌మేటర్ అంటున్నాడు. 'సివిలేంటండి ఇంట్లో దొంగలు పడితే' అని గట్టిగానే అరిచాను. 'నేను అతన్ని పిలిపిస్తాను. మీరు స్టేషన్‌కి రండి' అని వెళ్లిపోయాడు. ఇంతలో వాడే వచ్చాడు. వంకరనవ్వు నవ్వుతున్నాడు. వాడప్పటికే ఎస్.ఐని మేపి వుంటాడు. నాకర్థమయింది. ఇది ఇక్కడ తేలదు అని.

ఇంటికి వెళ్లి ఆలోచించాను. మా ఆవిడ వాడితో ఎందుకండి అసలే రౌడి, అని గొణుగుతోంది.

నాముందు రెండు దారులే వున్నాయి. ఒకటి మనుష్యుల్ని (అంటే రౌడీల్ని) తీసుకువెళ్లి పగలగొట్టిన గోడ కట్టించి కాపలా నిలబడాలి. (మళ్ళీ పగలగొడతాడు. వాడి సంగతి తెలిసిందే). రెండు కోర్టుకు వెళ్లి ఏదో ఆర్డరు తీసుకుని పోలీసుల్ని వెంటబెట్టుకుని గోడ కట్టించాలి. ఒక పౌరుడిగా నేను చేయాల్సింది ఇదేనా? ఈ కార్యక్రమం ఎన్నాళ్లు పడుతుంది. లాయరు, కోర్టు, వాయిదాలు, వాదనలు, డాక్యుమెంట్లు, పోలీసులు ఇదే. కోర్టులో పిటిషన్ వేశాను. ఒక పౌరుడికి జీవించే హక్కు రాజ్యాంగం ఇచ్చింది. అలాగే ఆస్తిహక్కు ఇచ్చింది. వాటిని భంగపరచినవాడు నేరస్తుడే!

ఈ కథ ఇక్కడితోనూ ఆగలేదు. నేను వెంటనే ఏ విధంగాను వాడి దుశ్చర్యను అడ్డుకోలేక పోయానని వాడు మరింతగా రెచ్చిపోవటం మొదలు పెట్టాడు. వాడు కొత్తగా నా గోడ పగలగొట్టి ప్రధాన వీధికి దారిని – నా ఆస్తి లోపలనుండి చిన్న గేటుతోసహా పెట్టుకున్నాడు దానిలో చాలా అడ్డంకులు వాడికి వున్నాయి. అంతకు ముందు అది కేవలం మా భవనానికి బ్రీతింగ్ స్పేస్. ఎవ్వరూ నడక కోసం వాడేవారం కాదు. అవసరము రాలేదు. అందుకని మధ్యలో ఒక బోరు – దానికి మోటారు – దానిపైన ఒక డోమ్ వుండేది. నీటి నిలవకు ఒక పెద్ద సంపు వేండేది. ఇవన్నీ వాడి నడకకు అంటే హాస్టల్ కుర్రాళ్లు, మెస్ వంటవాళ్లు, చెత్తా చెదారం వాళ్లూ నడవటానికన్నమాట! ముందు మోటారు తీసి సబ్‌మెర్సిబుల్ పెట్టాడు. అంటే అక్కడ అడ్డులేకుండా – తర్వాత ఒక రాత్రి, వాడు ఏది చేసినా అర్ధరాత్రే చేస్తాడు. దొంగలు రాత్రులే కదా చొరబడేది. అంత పెద్ద నీటి సంపుని పూడ్చేశాడు.

మా ముసలి కాపలా దారుణ్ణి ఏదో మేనేజ్ చేసి ఉంటాడు. వాడు నాకు వార్తలు జేరవేయటం మానివేశాడు. అప్పటికే నేను విశాఖపట్నం వెళ్లటానికి సన్నాహాలు చేసుకుంటున్నాను.

బోరు అడ్డులేకుండా నీటి గుంట పూడ్చి ఆ దారిని వాడు రాజమార్గం చేసుకున్నాడు. దాదాపు ఆరువందల చదరపు అడుగులు మోటు టైల్స్ వేయించాడు. ఇదంతా నా ఆస్తిలో వాడు చేయిస్తున్న అక్రమ నిర్మాణాలు. నేను చేతకాని వాడిలాగా చూస్తూ (చూడకుండా) వుండిపోయాను. ఈ అన్యాయానికి లోపల రగలిపోతోంది. ఎవ్వరికి చెప్పుకోలేని చెప్పరాని అన్యాయం, నేరం.

నేను విశాఖపట్నం చేరిన తర్వాత వాడి ఆగడాలు అక్కడితో ఆగలేదు. ఆగితే నేనింత కఠినమైన నిర్ణయానికి రాకపోదును. వాడిని క్షమించకపోయినా – శిక్షించేవాడిని కాదేమో!

ఆగడాలు అన్నాను కదా – అవి – మెయిన్‌రోడ్డు నుంచి వాడి భవనానికి కరెంటు సర్వీసు ఈ నా దారిలో నుంచి వేయించాడు. అదీ అండర్ గ్రౌండ్ కాకుండా పైనుంచి. అంటే నేను భవనానికి రంగులు వేయించాలన్నా – ఏ చిన్న పని చేయించాలన్నా పరంజా పెట్టటానికి వీలు లేకుండా పోయింది. ఒకసారి ఇక్కడకు వచ్చినపుడు కరెంటు డిపార్ట్‌మెంట్ వాళ్లకు ఫిర్యాదు చేశాను. వాళ్లు “ఆయనతో చెప్పండి. అండర్‌గ్రౌండ్ కేబిల్ తీసుకోమని” అని వూరుకున్నారు. అన్యాయానికి ఎన్ని ముఖాలో. మళ్లీ పోలీసు సి.ఐతో చెప్పాను. వాళ్లు ‘ఇది సివిల్ మేటర్ అండీ’ తప్పించుకున్నారు.

వాడు చేసిన మరో నేరం–పెద్ద నేరం చెప్తాను వినండి.

మాకు ఎదురుగా ఒక సైటు వుంది. అది ఖాళీగా లేదు. ఏదో చిన్న కట్టడం వుంది. ఇది మా పెద్దత్త గారిది. ఆమెకు పిల్లలు లేక తమ్ముడికి రాసి ఇచ్చి వెళ్లిపోయింది. ఆమె పోకముందు ఆమె గుంటూరులో వుంటే వెళ్లి కలిశాను. అమ్మా ఈ స్థలం నాకు అమ్మండి. మార్కెట్ రేటుకే అని అడిగాను. ఆమె మామ మీద కోపంతో నాకివ్వనన్నది. అంతకంటే గట్టిగా నేను ప్రయత్నం చేయలేదు.

ఆమె చనిపోయిన తర్వాత ఆ స్థలం మీద వాడి కన్ను పడింది. దూరపు అక్రమ చుట్టరికాన్ని అడ్డుపెట్టుకుని ఇంటికెళ్లి అమ్మ రంకు చెప్పుకుని ఆ స్థలంపై నాకు హక్కుందని కోర్టులో దావా వేశాడు. ఒకరోజు కోర్టులో కలిసినపుడు వాడే వెకిలిగా నవ్వుతూ చెప్పాడు. ఆరి దుర్మార్గుడా అని ఆశ్చర్యపోవటం నావంతయింది. అప్పటికే

నామీద చాలా చులకన అభిప్రాయం వాడికి ఏర్పడిపోయింది. ఒక చేతకాని దద్దమ్మగా నన్ను పరిగణించాడు. ఇవన్నీ నాలో రగిలే మంటకు నెయ్యి పోసినట్లయింది.

* * * *

ఇది ఇక్కడితో కూడా ఆగలేదు. ఒకసారి నేనేదో పెళ్లికి వచ్చి బిల్డింగ్ అంతా చూసి, చుట్టూ తిరిగి తూర్పు గేటు దగ్గరకు వచ్చాను. ఆ గేటు తాళం వేసి వుంచమని ముసలి కాపలా వాడికి ఎన్నిసార్లో చెప్పాను. వాడు తాళం ఆయన తీసుకున్నాడని గొణిగాడు. అక్కడ క్రీ పాయింట్ పెట్టి లోపల హాస్టలు పెట్టి నెలానెలా డబ్బు బాగానే పోగుచేస్తున్నాడు. ఇవన్నీ నా హక్కులకు, నా రాజ్యాంగ హక్కులకు భంగం కలిగించేవే. కాని చూస్తూ చూడకుండా ఉండిపోవలసి వచ్చింది. పైకి అలా అన్నా లోపల లావా ఉడుకుతోంది. లావా అంటే రాళ్లు కరిగి ద్రవంలాగా మారి నిప్పులు రవ్వయి ఎగచిమ్మటానికి సిద్ధంగా ఉడుకుతోంది.

మరోవిషయం చెప్పటం మరచిపోయాను. నా తూర్పు (ఈశాన్య) గేటు లోపల పది అడుగుల దూరంలో తూర్పు గోడకు వాడి పేరు చెక్కిన రాతిఫలకం బిగించాడు. అది చూసి ఒక్కసారిగా వాడి సమాధి రాయి వాడే చెక్కించుకున్నాడు అని తెలియకుండానే నవ్వుకున్నాను.

ఆ తర్వాత నేను హైద్రాబాద్ రావాల్సి వచ్చింది. అంటే తరచూ మా పట్టణానికి – నా భవనానికి వెళ్లటానికి వీలుగా వుంది కారులో. ఇది ఒకరకంగా నాలో రగులుతున్న అగ్నిని ఒక యజ్ఞగుండంగా మార్చి పశువును బలి ఇవ్వటానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాను. హత్య చేయటం అంత తేలిక కాదు. అదీ చిక్కకుండా ప్లాన్ చేయాలి కదా.

ధర్మానికి నాలుగుపాదాలంటారు. అలాగే మన రాజ్యాంగానికి నాలుగు (ప్రజాస్వామ్యానికి) స్తంభాలంటారు. ఒకటి రాజ్యం (అంటే ప్రభుత్వం) రెండు న్యాయస్థానం, మూడు ఎగ్జిక్యూటివ్స్ అంటే ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్ వారి పరివారం. నాలుగు వార్తాపత్రికలు–ప్రెస్, నా రాజ్యాంగ హక్కును పై నాలుగూ కాపాడలేకపోయాయి. దాదాపు అందరి తలుపూ తట్టాను. ఎవరి సాకు వాళ్లు చెప్పారు. అందుకే–అందుకే నా ధర్మపోరాటానికి ఆయుధాన్ని నా చేతిలోకి తీసుకున్నాను. అధర్మాన్ని, అన్యాయాన్ని శిక్షించాలి కదా.

నేను హత్య చేయటానికి ఇలా కారణాలు చెప్పుకుంటూ పోతే, మిమ్మల్ని నమ్మించడానికో లేదా నన్ను నేను సమర్థించుకోవటానికో అనుకోవద్దు. నా విషయంలో జరిగిన–జరుగుతున్న అన్యాయాన్ని రాజ్యాంగం సాక్షిగా ఏ శాఖా అడ్డుకోలేదు. కనీసం విచారణ చేయటానికి కూడా ముందుకు రాలేదు. ఒక బాధ్యత గల పౌరునిగా నా ధర్మం నేను నెరవేర్చాలంటే దుర్మార్గుణ్ణి హతమార్చాలి. ధర్మాన్ని కాపాడాలి. ధర్మశాస్త్రాలన్నీ ఇదే ఘోషిస్తున్నాయి. ఇక్కడ ఒక చిక్కు ఉంది. ఇదే రాజ్యాంగ శాఖలైన న్యాయస్థానాలు, పోలీసు శాఖ, నేను హత్య చేసిన తరువాత నా మీదకు దూకటానికి సిద్ధంగా ఉంటాయి. శిక్షించడానికి ఏమాత్రం వెనకాడవు. అందుకే నా జాగ్రత్తలు నేను తీసుకోవాలి. మీకు కూడా ఇలాంటి అన్యాయం జరిగితే మీరు నన్ను అనుసరించాల్సిన అవసరం లేదు. నిర్ణయం మీ మానసిక స్థితి–వనరుల మీద ఆధారపడి ఉండొచ్చు.

ఈ క్రమంలో నా మనస్సాక్షికి ఇంత కూడా అపరాధ భావం రాలేదు. లేదూ. అందుకే ఈ హత్యకు ప్రణాళికలు సిద్ధం చేశాను. హత్య చేసి దొరికిపోవటం నాకు ఏ మాత్రం ఇష్టం లేదు. అందుకే ఎంతో జాగ్రత్తగా నా ప్లాన్‌లు తయారు చేసుకున్నాను.

మొదటి ప్రణాళికలో భాగం వాడితో మంచిగా వుండటానికి ప్రయత్నించాను. వాడి బలహీనతలు నాకు బాగా తెలుసు. విజయవాడ – తెనాలి, గుంటూరు ప్రాంతంలో ఎవరెవరి ప్లాటులో వీడు కమీషన్ తీసుకుని అమ్ముతుంటాడు. నన్ను చాలాసార్లు అడిగాడు కూడా. ఆ వంకతోనే వాడిని నా కారు ఎక్కించుకుని డోరులాకు చేసి కృష్ణవతల మద్రాసు కాలవ ప్రక్క రోడ్డులో తీసుకుపోయి వైట్‌ఫీల్డ్ దగ్గర కారు కాలవలోకి వదిలేద్దామని రెండు మూడుసార్లు రికీలు చేశాను. ఇది ప్రమాదంగానే కనిపించాలి. నేను బయటపడాలి. వాడు కారుతో సహా మునిగిపోవాలి. ప్లాన్ అయితే పక్కాగానే ఉంది. వాడు నేనెప్పుడు రమ్మంటే అప్పుడు రావటానికి సిద్ధంగానే వున్నాడు. ప్లాటు అమ్ముకోవాలి కదా.

ప్లాన్‌లో రెండు ప్రమాదాలు వున్నాయి. వాడు చివరి నమిషంలో ఎవరినైనా తోడు తీసుకువస్తే – కుదరదు. రెండో ప్రమాదం నాకు ఈతరాదు. రవీస్ కాలవ చాలా లోతు. వెడల్పు ఉంటుంది. కారు నీటిలో పడకముందే దూకాలి. అది ఆలస్యమైతే నా ప్రాణానికి ప్రమాదము. ప్రమాదంగా కనపడవలసింది ప్రమాదంగా మారిపోతుంది.

మరో ప్లాను సిద్ధం చేశాను. వీడికున్న బలహీనత మందు. రోజూ సాయంత్రం పీకల్దాకా తాగుతాడు. నా స్థలంలో నుంచి వాడు పెట్టిన గేటు తీసుకుని వాడికి చిన్న గది – ఒక బల్ల నాల్గు కుర్చీలు, అంతా బాగానే ఏర్పరచుకున్నాడు. ఇవన్ని నేను చూడవలసి వచ్చింది, నా ప్లానులో భాగంగా.

నేను వేసిన భయంకరమైన ప్రణాళిక. ఓ రాత్రి వాడిని పీకల్దాకా తాగించి అదే ఆల్కహాల్‌తో ఫైర్ ఆక్సిడెంట్ చేసి చేతులు కాల్చుకుని వాడిని మంటలో వదిలి బైటపడాలి. ఈ ప్లానులో కూడా చిన్న ప్రమాదాలున్నాయి. అరే ఎవ్వరినీ పిలవకురా అంటే వాడికి అనుమానం రావచ్చు. ఎవ్వరూ రాకుండా నేనే జాగ్రత్తపడాలి. బాగా మత్తు ఎక్కే బ్రాండ్ తీసుకోవాలి. వాడితో ఎక్కువసేపు తాగించాలి. అంతసేపు వాడికిష్టమైన వాగుడు వాగాలి. ఏ పదకొండు గంటలకో సీసావంపి వాడి సిగరెట్టుతోనే అంటించాలి. (నా దగ్గర ఒక హవానా చుట్ట వుంది).

వాడిని చంపటానికి సంకల్పించాను. అదీ రాజ్యాంగ విరుద్ధమే, వాడు బ్రతుకే హక్కును హరించడం నేరమే. అయితే అలాంటి నేరం వాడు గత అయిదారు సంవత్సరాలపైగా చేస్తూనే వున్నాడు. నన్ను అంతులేని మానసిక క్షోభకు గురిచేస్తున్నాడు. కంటికి కన్ను – ఎప్పటినుంచో యుద్ధ సూత్రం వుంది. ఇది బోర్డర్ సమస్య. సరిహద్దు సమస్య. యుద్ధం చెయ్యాలి. గెలవాలంటే శత్రువును ఏమరిపాటున పెట్టి తుదముట్టించాలి. అదే నా సంకల్పం. ధర్మం నావైపు వుంది. న్యాయం కళ్లుమూసుకుంది. సంఘానికి ఇలాంటివి పట్టవు. ఇది ఒంటరి పోరాటం. వాణ్ణెలాగైనా తుదముట్టించాలి. నా రాజ్యాంగ హక్కును కాపాడుకోవాలి. నాకు జరిగిన హక్కుల భంగం – దానిమూలంగా కలిగిన మానసిక క్షోభ – అసహనంతో మిగిలిన అవమానం ఇవన్నీ నా ధర్మాగ్రహానికి కారణం. వాణ్ణి శిక్షించాలనే నా సత్సంకల్పానికి తప్పనిసరిగా ప్రకృతి శక్తులు కలిసి వస్తాయి అని గట్టి నమ్మకం, అపార విశ్వాసం నాది.

నా సంకల్పం ఇంతై – ఇంతింతై మేరు పర్వతంలా మారిపోయింది. ఇంకా కొన్ని ప్రణాళికలు వేశాను. గుంటూరు గాంగుతో హత్య చేయిద్దామని, హైద్రాబాద్ పిస్టల్ రౌడీతో కాల్పిద్దామని – కాని ఇది జరిగినా చివరికి నా దగ్గరికే వస్తాయి. వాడికి చాలామంది శత్రువులున్నారు. కాని సరిహద్దు నాదే. మొదటి ముద్దాయి నేనే అవుతాను. దొరికిపోవటం చేతగాని తనం. అసలే చేతగానివాడిగా ఇన్నాళ్లూ చూస్తూ గడిపాను. ఇది అట్లా కాకూడదు. వెపన్‌తో మర్డర్ చేయకూడదు. దొరికిపోతాం. మర్డర్ వెపన్ పోలీసులకు వరం! మొదటి రెండింటిలో ఏదో ఒకటి త్వరగా అమలు చేయాలి.

* * * *

ముహూర్తాలు గుడ్డూ లేదు కాని – అనుకూలమైన తేదీలు కొన్ని ఎంచుకున్నాను. నిప్పుకంటే నీరు నయమని – నా కారుని ఎరగా వేయటానికే మొగ్గుచూపాను. వాడిని అరే ప్లాటులు చూడటానికి వెళ్దాం త్వరలో అని ఆశపెట్టాను కూడా.

కాని అంతలో కరోనా వైరస్ దేశంలోకి చొరబడింది. మొదటిసారి వచ్చినపుడు ఎవ్వరూ అంతగా పట్టించుకోలేదు. పెరిగిన కొద్దీ ప్రభుత్వం లాక్‌డౌన్ పెట్టింది నెలరోజులు – ఆ నెలరోజులే కాదు ఆర్నెల్లు అన్నీ ఆగిపోయాయి. ఒక్కసారి బిల్డింగ్ దగ్గరకు రాగలిగాను. అద్దెకుండే వాళ్లంతా ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. వాళ్లకి అడ్వాన్స్‌లు తిరిగి ఇవ్వాల్సి వచ్చింది. అసలే వత్తిడిలో వున్నాను. దీనితో మరింత మానసిక క్షోభకు గురి కావల్సి వచ్చింది. అందరిదీ అదే పరిస్థితి. అప్పటికింకా వాక్సిన్ రాలేదు. అలా సంవత్సరంపైన గడచిపోయింది. కరోనా బారిన పడకుండా జాగ్రత్తపడటం జీవితమై పోయింది. అదృష్టవశాత్తు నావాళ్లెవరూ దీనికి లోను కాలేదు. మనం సుఖంగా వున్న తర్వాతే చుట్టూ ఏమి జరుగుతుందో గమనిస్తాం. మొదటి వేవ్ అయిన తర్వాత అతికష్టం మీద ఇక్కడకు రాగలిగాను. అప్పుడు గమనించింది మా పేట అంతా భయంతో చచ్చిపోతున్నారు. ఎవ్వరూ బయటకు రావటం లేదు. ఆదాయం లేక అల్లాడిపోతున్నారు. ఎటు చూసినా చావులు, శవాలు ఆసుపత్రులు, స్మశానాలు ఖాళీ లేవు. మరీ అవసరం అయిన వారిని ఆదుకున్నాను.

నా ప్రక్కన చూస్తే వాడి హాస్టలు ఖాళీ అయిపోయింది. కర్రీ పాయింట్ మూతపడి ఈసురోమంటున్నాడు. ఇవేమీ నా లావాను తగ్గించలేదు. పైగా నా సంకల్పం ఒక శాపంలా మారి వాడిని చుట్టబెట్టాలని గాఢంగా వాంఛించాను. నాది ధర్మాగ్రహం. ఊరక ఆరిపోదని నా పిచ్చి నమ్మకం. మంత్రాలకు చింతకాయలు రాల్తాయా? ఏమో చూద్దాం! ఆశ చావదు కదా.

* * * *

ఇక్కడ వున్నపుడు ఒకసారి గుంటూరు వైపు కారులో ఒక్కడినే వెళ్లాను. దారి పోడవునా పోలీసులు– అడ్డంకులు– అక్కడక్కడ రోడ్డు రెండు వైపులా గుంటలు తవ్వుతున్నారు. పోలీసులూ, గవర్నమెంటు బంట్రోతులు పహారా కాస్తున్నారు. ఎవరినో పట్టుకుని అడిగితే స్వరం తగ్గించి అవి రాత్రి వచ్చే శవాలకోసం. స్మశానాలు ఖాళీలేవుగా అన్నాడు. నాకు వళ్లు జలదరించింది. ఇవన్నీ చీకట్లో – అంబులెన్సులో శవాలను తరలిస్తున్నారు. అరే మనిషి బ్రతుకు? ఎంత దారుణంగా మారింది!

ఇలా రోజులూ నెలలూ గడిచిపోతున్నాయి. నేను హైద్రాబాదు వెళ్లి వాక్సిన్ వేయించుకుని వచ్చాను. ఇక్కడ లేకపోతే ఖాళీ అయిన ఆఫీసులు లోపల ఎంతో చిందర వందరగా వుండి – కొత్తగా అద్దెకు వచ్చేవారికి

సమాధానం చెప్పే వాళ్లుండాలి కదా. బిల్డింగ్‌లోనే మకాం పెట్టాను. నా మొదటి ప్లాన్ అమలులో పెట్టటానికి అవకాశం కోసం చూస్తున్నాను. ఇప్పుడు తేలిక. ఎవరూ తిరగటంలేదు.

రెండో వేవ్ విరుచుకుపడింది. ఈ మధ్యలో నా రెండో ప్లాను కోసం రికీ చేయాలని వాడితో వాడి గదికి అదే నా గోడ పగలగొట్టి పెట్టిన గేటులో నుంచి వెళ్లి నా జాగ్రత్తలు నేను తీసుకుని ఎన్ 95, సర్జికల్ మాస్క్ పెట్టుకుని వాడితో మందు తాగించాను. విపరీతంగా సిగరెట్లు తాగుతున్నాడు. మధ్యలో దగ్గుతున్నాడు. 'బావగారూ మనం చిరంజీవులం. మనకు కరోనా–కాకరకాయి రాదు.' అయితే ముఖానికి కూడా విస్కీ రాసుకో మంచిది అన్నాను. అలాగే జల్లుకున్నాడు. ఇదే మంచి సమయం అనుకున్నాను. కాని ఈ రాత్రి నేను సిద్ధంగా లేను. వాడిని ఆ పొగలో, ఆ మత్తులో – ఆ దగ్గులో వదిలి వాణ్ణి ఒక పురుగుని చూసినట్లు వాడు చావుకు దగ్గరవుతున్నట్లు నాకెందుకో బాగా అనిపించింది. బహుశా అది నా కోరిక కావచ్చు.

ఒకవారం గడిచింది. 'ఏరా ఎప్పుడు?' అన్నాను. వాడికి అర్థం కాలేదు. ప్లాట్లు గీట్లు నడవడం లేదు. బయట మనుష్యులే తిరగటం లేదు. వల్లకాడుకు శవాల క్యూ నడుస్తోంది. అంబులెన్సులన్నీ ఆసుపత్రికి కాక శ్మశానానికే వెళ్తున్నాయి. నేను నిప్పుకే సిద్ధమయ్యాను.

'నాకు జ్వరంగా వుంది' అన్నాడు నీరసంగా. నాకేదో ఆశ వెలిగింది మెరుపులా! 'నీకేంటి జ్వరం ఏంటి – రాయిలా వున్నావు. మొదలుపెట్టు. నేను వచ్చి కలుస్తాను' అన్నాను. వాడు నేను ఇచ్చిన ధైర్యంతో గదిలోకి వెళ్లి బాటిల్ తీశాడు. ఎన్ 95 మాస్క్ పెట్టుకుని నేను తొంగి చూసేలోపే రెండు పెగ్గులు తాగి వుంటాడు. సిగరెట్లు ఒకటే పొగ, నేను గుమ్మంలోంచి వాడి కళ్లల్లోకి చూశాను. నాకెందుకో వాడు మృత్యుముఖంలో వున్నట్టనిపించింది. మనకు కావలసిందే కనపడుతుందేమో? కాని వాడికి నా శాపం తగిలింది. వాణ్ణి నా చేతికి మందు అంటకుండా మట్టుపెట్టవచ్చు. 'కానీరా నీకేంటి' అని గుమ్మంలోనే నిలబడ్డాను. అప్పటికే జ్వరంతో ఉన్నాడు. సిగరెట్లు తాగుతున్నాడు. ఆల్కహాలు రక్తం నిండా ఉంది. సీసా వంపి అగ్గిపుల్ల గీయటమే. కరోనా మూలంగా చుట్టు పక్కల ఎవ్వరూ నర మానవుడు లేడు. వీడికి దిక్కులేదు. ఇప్పుడు నేనే దిక్కు. నేను వాడికి యమ దిక్కు. గదిలోకి చూశాను. కుర్చీలో సగం వంగిపోయి వున్నాడు. కళ్లలో నీడలు, నోటిలో సిగరెట్టు, గ్లాసులో విస్కీ. సీసావంపి నిప్పు పెట్టటమే. ఎందుకు ఆలస్యం? నాలోని ఘటోత్కచుడు పగలబడి నవ్వుతున్నాడు.

* * * *

అంబులెన్స్‌ను నేనే పిలిచాను. అవీ దొరకటం లేదు. ఏ ఆసుపత్రి ఖాళీగా లేదు. అయినా ఆసుపత్రి ఎందుకు? ఆక్సిజన్ కరువుగానే వుంది. డ్రైవరుకి వెయ్యిరూపాయలు అంటుకోకుండా అందించాను.

వాడు అప్పటికే స్పృహలో లేడు. రాడేమో. వాడిని అంబులెన్స్‌లోకి దుప్పటిచుట్టి మాస్క్‌లో వున్నవాళ్లే మోసుకుపోయారు. అందులోనూ ఆక్సిజన్ వున్నట్లు లేదు.

ఇంకా వెల్తురు రాని చీకటి రాత్రిలో వాడి చివరి యాత్ర సాగిపోయింది.

నాలోని ఘటోత్కచుడు వెకిలినవ్వు నవ్వుతూనే వున్నాడు. వాణ్ణి నేనే చంపాను. ఈ హత్య నేనే చేశాను. మీరు చెప్పినా ఎవ్వరు నమ్మరు – హాహా!

* * * *